# వెన్నెల

కొరుకొండ సత్యానంద్

**సమయం** పదకొండు గంటలు కావస్తోంది. ఆ ఇంట్లో అందరూ నిద్రపోయారు, ఆమె తప్ప. ఆమెకు నిద్ర రావడం లేదు. కారణం—ఆమె ఆలోచిస్తూంది.

నిజం చెప్పాలంటే చక్రవర్తి ఆమె జీవితంలోకి ప్రవేశించలేదు. కావాలని కాకపోయినా, ఆమే చక్రవర్తి జీవితంలోకి వెళ్ళింది.

ఆ రోజు ఆ ఇంటి తలుపు తట్టింది ఆమె. రెండు నిముషాల్లో తలుపు తెరుచుకుంది. ఎదురుగా అతను.

"చక్రవర్తి అంటే మీరేనా ?"

అవునన్నట్లు తల వంకించాడు అతను.

చక్రవర్తి తల చెదిరిపోయి ఉంది. కళ్ళు లోతుకుపోయి ఉన్నాయి. మనిషేదో ఆందోళనగా ఉన్నాడు. ఎదురుగా ఉన్న అపరిచితురాలైన ఆమె వైపు అసహనంగా చూస్తూ "ఎవరు మీరు ? ఏం కావాలి ?" అని అడిగాడు.

"మీకేమీ అభ్యంతరం లేకపోతే నేను లోపలకు వస్తాను. అప్పుడన్నీ మాట్లాడుకుందాం" అందామె. ఒక్క నిముషం చక్రవర్తి ఆమెవైపు అదోలా చూసి "రండి" అని పక్కకు తప్పుకున్నాడు.

ఆమె లోపలికి వెళ్ళింది. ఒకే గది. గదంతా రంగులు, కాన్వాసులు, బ్రష్‌లు చిందర వందరగా పడి ఉన్నాయి. కానీ ఒక మూల మాత్రం ఒక చిత్రం ఉంది. దాన్ని చూసింది ఆమె.

"ఇది మొన్న జరిగిన చిత్రకళా ప్రదర్శనలో ఉంది కదూ ?" అని అడిగిం దామె.

"అవును—ఇలా కూర్చోండి" అని చాప చూపించాడు చక్రవర్తి.

ఆమె చాప మీద కూర్చుంది...

"ఇప్పుడు చెప్పండి. ఎవరు మీరు?" అడుగుతూ ఆమె కెదురుగా గోడనానుకొని కూర్చున్నాడు చక్రవర్తి.

"చెప్పుకోడానికి పెద్దగా ఏమీ లేనిదాన్ని గానీ నేను మీ అభిమానిని."

ఆ మాటకు చక్రవర్తి ఆమెవైపు విస్మయంగా చూశాడు...

"మీ చిత్రాల్ని నేను చాలా సందర్భాల్లో చూశాను ఎప్పటినుంచో మిమ్మల్ని కలవాలని అనుకున్నాను గానీ వీలు పడలేదు. కానీ మొన్నటి ప్రదర్శనను ఎరేంజి చేసిన వాళ్ళ నడిగి మీ అడ్రసు సంపాదించి మిమ్మల్ని కలుసుకోగలిగాను."

"అనవసరంగా కష్టపడ్డారు."

"కాదు—అవసరం కోసమే కలుసుకున్నాను."

"అంటే?"

"చెబుతాను. కానీ, మీకు కోపం వస్తుందేమో !?"

"నా కెప్పుడూ నామీదే కోపంగా ఉంటుంది. ఎదుటివాళ్ళమీద కోప్పడే మనస్తత్త్వం కాదు నాది."

"అయితే ఓ ప్రశ్న వేస్తాను."

ఏమిటన్నట్లుగా ఆమె వైపు చూశాడు చక్రవర్తి.

"వెన్నెలంటే మీకు ఇష్టమేనా?"

"చాలా."

"అంటే నేనన్నా మీరు ఇష్టపడుతున్నారన్న మాట."

"మీ ఉద్దేశం?"

"ఏమీ కాదు. నా పేరు వెన్నెల."

"బాగుంది."

"మీ రింత వరకూ దేన్ని గురించో బాగా ఆలోచించారు కదూ ?"

"ఎలా చెప్పగలిగారు ?"

"మిమ్మల్ని చూస్తుంటే నా కలా అనిపిస్తుంది."

"అవును. నా బ్రతుకును అసహ్యించుకుంటున్నాను. నా కెందుకో పిచ్చెక్కి పోతూంది. అసలు..." చక్రవర్తి మధ్యలోనే ఆపేశాడు.

"చెప్పండి."

"పిచ్చివాణ్ణి. అందుకే మీరెవరో తెలియకుండానే ఏదేదో చెప్పేస్తున్నాను. చెప్పండి, మీరెవరు ? ఎందుకొచ్చారు ?"

"చెప్పాను కదండీ—మీ అభిమానినని! ఎందుకొచ్చానో తరువాత చెబుతాను గానీ అందరికీ సొంతం కాని కళ మీ చేతిలో ఉండి కూడా మీరెందుకు మీ బ్రతుకును తిట్టుకుంటున్నారు ?"

"నేను అనవసరంగా కళాకారుణ్ణైనందుకు."

"అర్థం కావడం లేదు..."

"నిజమే, చెబితే ఇది ఎవరికీ అర్థం కాలేదు. సరదాగా నేర్చుకొన్నాను. బాగా వేయగలనని పదిమంది చేతా అనిపించుకున్నాను. ఈ కళ వల్లనే నేను పెద్దగా చదువుకోలేదు. ఉద్యోగాల కోసం ప్రయత్నించలేదు. ఈ దాహం నన్ను బలి తీసుకుంది. ఎందుకూ కొరగాని వాణ్ణిగా చేసింది. పోనీ ఈ కళ ద్వారానైనా బ్రతుకుదామని నిశ్చయించుకున్నా, బయటి ప్రపంచం చూసి మెచ్చుకుంటుందే గానీ, పైసా విలువ కూడా చెయ్యదు నీ కళ అని వెనక్కి తిరిగి వెళ్ళిపోతుంది. పేరున్న వాళ్ళకే ప్రతీ వారూ పట్టం కడుతున్నారు." చక్రవర్తి అలసిపోయినట్లుగా ఆగాడు.

"ఆ పేరున్న వాళ్ళు కూడా మీ లాంటి చిత్రకారులేనేమో ?"

"కాదు. ఈ చిత్రకళలో నాకంటే గొప్పవాళ్ళు కాదు. ఆ విషయం వాళ్ళు కూడా ఒప్పుకుంటారు. కానీ ఈ పిచ్చి ప్రజలే ఒప్పుకోరు."

"కారణం ఏమంటారు ?"

"ఈ ప్రజలు పిచ్చివాళ్ళు. సమాజాన్ని రంగులతో విశ్లేషించే వాళ్ళను ఆదరించలేరు. గుడ్డలిప్పుకున్న ఆడదాని అందాన్ని ఎంత పచ్చిగా వేస్తే అంత ఖరీదు పెట్టి కొని తమ భవనాల్లో తగిలించుకుంటారు. వాటిని వేసిన వాడినే కళాకారుడని నెత్తిమీద పెట్టుకుంటారు. వెన్నెల గారూ, ఒకసారి ఒకావిడ అటువంటి న్యూడ్ చిత్రాన్నే ఎంతో డబ్బు పెట్టి కొని కార్లో పెట్టుకొని వెళ్ళింది. అస లామె ఆడదేనా? అనిపించింది నా కప్పుడు. ప్రకృతి, దానిలోని అందాలు, సమాజం, దానిలోని కుళ్ళు, రాజకీయం, అరాచకత్వం, అన్యాయం, అక్రమం, దోపిడీ—ఇవన్నింటికంటే ఆడదాని ఒంపుసొంపుల్నే ఈ ప్రజలు పట్టించుకుంటారు. చాలా కళల్లో ఆడదాని అంగాలకే ప్రాముఖ్యాన్నిస్తా రెందుకు? వాటికే నిజమైన విలువ ఉందా ?"

"నిజమైన విలువ ఉందో లేదో గానీ, విలువ మాత్రం ఉంది అని అర్థం అవుతూంది."

"అవునండీ, ఎవరూ పిచ్చివాళ్ళు కారు—నేనే పిచ్చివాడిని. ఎవరెన్ని చెప్పినా వినని వెర్రివాణ్ణి" అని ఆగి "మీకు పెళ్ళయిందా ?" అని అడిగాడు చక్రవర్తి.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది వెన్నెల.

"మిస్ వెన్నెలా! మొన్న జరిగిన ప్రదర్శన



మీరు చూశారుగా?"

"ఆఁ. చూశాను."

"ఆ ప్రదర్శనకి నేను ఎంతో కష్టపడి వేసిన ఈ చిత్రాన్ని ఎగ్జిబిట్ చేశాను. నా చిత్రమే బాగుంది అని నేననను గానీ, మీరూ చూశారుగా? పేరున్న వాళ్ళకూ, అందులోనూ ఒక అర్ధనగ్న చిత్రానికీ, కనిపించీ కనిపించకుండా కనిపించే ఒక రతిక్రీడ భంగిమకూ బహుమతు లిచ్చారు. తనపై జులుం చలాయిస్తున్న ఓ భూస్వామి పిడికిలి బిగించి ఎదురు తిరుగుతున్న రైతుకూలీని చిత్రిస్తే దాన్ని ఓ పక్కన పడేశారు."

"అవును. అలాంటప్పుడు కష్టపడి అలాంటి చిత్రాల్ని వేసేకంటే మీరు కూడా వాళ్ళలాగే అలాంటి చిత్రాల్నే వేయొచ్చుగా? ఈ కాలం కళాకారుణ్ణి ఎవరూ పోషించరు. అతన్ని ఆ కళే పోషించాలి."

"వాళ్ళు కూడా మీలాగే అన్నారు."

"ఎవరు?"

"మొన్నటి ప్రదర్శనలో బహుమతు లందుకున్న వాళ్ళు."

"వాళ్ళు మీకు తెలుసా?"

"తెలియడమేమిటి? వాళ్ళు నా మిత్రులు. నాతోపాటే చిత్రకళను అభ్యసించినవాళ్ళు. నా చేతిలోని కుంచె తీసే పరుగుల్ని విస్మయంగా చూసే వాళ్ళొకప్పుడు. దారి మారిపోయి పెద్దవాళ్ళయ్యారు. అయినా నన్ను మరచిపోలేదు. నా అన్నవాళ్ళు ఎవరూ లేకపోయినా అవసరానికి ఎప్పుడూ ఆదుకుంటారు. వాళ్ళతో పాటే ఉండమంటారు. కానీ నేనే ఎందుకో అక్కడ ఇమడలేక ఇక్కడే ఉంటున్నాను. వాళ్ళు నడిచే ఆ దారిలోకే నేనూ వెళ్ళలేకపోతున్నాను. ఈ దారిలో నడవలేక అలసిపోతున్నాను. కళకు నిర్వచనం మారిపోయింది మిస్ వెన్నెలా!"

"అవును. ఆ మార్పు కాలమే తీసుకువచ్చింది. మనిషి కాలానికి కళ్ళాలు వేయలేడు. కాలంతోపాటు నడవక తప్పదు."

ఓ అయిదు నిముషాలు వాళ్ళిద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది.

బరువుగా నిట్టూరుస్తూ చక్రవర్తే అన్నాడు..."నాకూ అలాగే అనిపిస్తుంది. నాలాగ అందరూ ఆలోచించాలి అని అనుకునే వాణ్ణి. కానీ క్రమక్రమంగా నాకు అందరిలాగ ఆలోచించక తప్పడం లేదు."

అలా ఇద్దరూ మరికొంత సేపు మాట్లాడుకున్నాక 'వెళ్ళొస్తా'నని చెప్పి లేచింది వెన్నెల.

"మీ గురించి చెప్తానన్నారు. ఏమీ చెప్పకుండా వెళ్ళిపోతున్నారు" అన్నాడు చక్రవర్తి...

"సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతాను. అభిమాన చిత్రకారుణ్ణి కలుసుకోవాలని అనుకున్నాను. కలుసుకున్నాను. మీ అభిమానికి మీ రో మాటివ్వాలి."

"చెప్పండి. ఏమిటి?"

"మీరు ఈ రెండు రోజులూ బాగా ఆలోచించి ఉంటారు. కానీ ఇంకా ఏ నిర్ణయానికీ రాలేదు. పరిస్థితుల్లో మనసు నలిగిపోయి నచ్చనివైపుకే అడుగు వేయమని చెబుతున్నా. అటువైపుకి అడుగు ముందుకేయాలంటే అడుగు తడబడుతుంది కదూ మీకు? నేను మళ్ళీ రేపు వస్తాను. అప్పటికి మీలో ఒక నిర్ణయం తుదిమెరుగులు దిద్దుకోవాలి. ఇది నా కోరిక. నా కోరిక తీరిన తరువాత నా గురించి అంతా చెప్తాను. వెళ్ళొస్తాను" అని వెళ్ళిపోయింది వెన్నెల.

ఆ గదిలో అటువైపు పడుకొని ఉన్న తల్లి తెరలు తెరలుగా దగ్గడంతో వెన్నెల ఆలోచనల్లోంచి బయటపడి లేచి లైటు వేసింది.

"అమ్మా! మాత్ర వేసుకొన్నావా?"

"వేసుకున్నానమ్మా! నువ్వింకా పడుకోలేదా?"

"తెలివొస్తే లేచాను. కొద్దిగా ఈ నీళ్ళు తాగు" అంటూ గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి తల్లి కిచ్చింది. నీళ్ళు తాగాక "నువ్వెళ్ళి పడుకోమ్మా!" అని పక్కకు తిరిగి పడుకుంది తల్లి.

తల్లికి కొంచెం దూరంలో పడుకొని ఉన్న చెల్లెలినీ, తమ్ముడినీ చూసింది వెనెల... తమ్ముడు ముడుచుకొని పడుకున్నాడు. చెల్లెలి పైట తొలగిపోయి ఉంది. ఆమె పైటను సర్ది భారంగా నిట్టూరుస్తూ లైటార్పేసి వెళ్ళి మేను వాల్చింది వెన్నెల.

మళ్ళీ ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి. అంటే అతని ఆలోచనలు ఇప్పటికి ఇటువైపుకి మొగ్గు చూపుతున్నాయన్న మాట. అవును మరి, ఆకలికి ఆ శక్తి ఉంది. అది ఎవర్నైనా లొంగదీసుకుంటుంది అనుకుంది వెన్నెల. అన్నట్టుగానే వెన్నెల ఆ మర్నాడు చక్రవర్తి రూమ్‌కి వెళ్ళింది. చక్రవర్తిని చూసిన వెన్నెలకు ఎందుకో కాస్త ఆనందం కలిగింది. చక్రవర్తి కాస్త రిలీఫ్‌గా ఉన్నట్టున్నాడు. గెడ్డం గీసుకొని ఫ్రెష్‌గా ఉన్నాడు. డ్రెస్ మార్చుకొని నీట్‌గా ఉన్నాడు. ముఖంలో కూడా ప్రశాంతత కనిపిస్తూంది.

"మీలో నిన్నటికీ, ఈ రోజుకీ చాలా మార్పు కనిపిస్తూంది నాకు."

"అవును. అభిప్రాయాల్ని అవసరానికి మార్చుకున్నాను. ఈ మార్పు నాలో రావడానికి ఎంత నరకయాతన పడ్డానో ఇన్నాళ్ళూ! కానీ ఇప్పుడు నాకెంతో తేలిగ్గా, హాయిగా ఉంది. నేను నడుస్తున్నది ముళ్ళదారి అనుకున్నాను గానీ, అది ఇప్పటికే ఎందరో నడవడం వల్ల ఎంతో సాఫీగా తయారయింది అని తెలిసింది ఈ మధ్యనే. మనసును చంపుకోవడం అనుకున్నాను గానీ బ్రతుకును నిలబెట్టుకోవడం అని అర్థమయింది బాగా ఆలోచించిన తరువాత. అందుకే నా మిత్రుల దగ్గరకు వెళదామని బయలుదేరినా మీరు వచ్చే వరకూ ఆగి, మీతో మాట్లాడేసి వెళదామని ఆగాను. ఎందుకంటే మీ పరిచయం, మీ మాటలు నా మనసుకు ఎందుకో అదోలాంటి ధైర్యాన్నిచ్చాయి."

"చక్రవర్తి గారూ! నిజంగా నాకెంతో ఆనందంగా ఉంది. మీ రీ దారిలో కొన్నాళ్ళు నడిచాక మీ కొచ్చే పేరు మీలోని అసలు చిత్రకారుడి ఊహలకూ, ఆశయాలకూ విలువ తెచ్చే సాధనం అవుతుంది. అప్పుడు మీరు ఇన్నాళ్ళూ చేరాలని ప్రయత్నించిన గమ్యాన్ని సులువుగా చేరగలరు."

"ఇంకా నేను ఒక్క అడుగు కూడా వెయ్యలేదు. అప్పుడే నన్ను చాలా ఎత్తుగా ఊహిస్తూ మీ మాటలతో నాకు ఊహా చిత్రాన్ని చూపిస్తున్నారు. ఇంకా నేను ఏమీలేని వాడిని. కావలసిన వాటి నన్నింటినీ ఎరేంజి చేస్తారని అన్న నా మిత్రుల దగ్గరకు వెళ్ళాలి."

"మీ దగ్గర లేనివి వాళ్ళ దగ్గర ఏమున్నాయి?"

"పలుకుబడి."

"ఎందుకు?"

"చిత్రాలను వేసినా అవి అమ్ముడవ్వాలిగా?"

"అప్పుడే ఆ చిత్రాన్ని వేసేశారా?"

"లేదు. వెయ్యడానికి కావలసినవి కూడా వాళ్ళే సమకూర్చాలి."

"అంటే కాన్వాసు, రంగులు, బ్రష్‌లు—ఇవేగా?"

## విదేశంలో నేను

జన్మదినాలు, పరిణయాలు, జయంతులు—
మనస్సులో మెరిసే మిణుగురు కాంతులు,
కాల ప్రవాహంలోకి కుర్రవాడు విసిరే కంకరరాళ్ళు.
జ్ఞాపకాల జయస్తంభాల అన్వేషణ
స్తంభించిపోతుంది
వర్తమానపు సుడిగాలిలో,
పారిపోతాయి
గొప్పతనపు వసంతాలు,
పిలవని విందులో బయటబడ్డ
బిదవాడి ఆశలా.

గాలిలో ఎగిరే చేపని నేను,
నీటిలో ఈదే పక్షిని,
తనమూలం కోసం గాలించి,
కృశించిన వృక్షాన్ని,
సప్తర్షి మండలంలో వశిష్ఠుడి జాడ తెలియని
అరుంధతి నేను,
విదేశంలో భారతీయుడు నేను.

నా యుక్తాహారం నా దేశపు ఆత్మ
కావాలి నా విహారం
నా సంస్కృతి అంతరాత్మ!

—డా. ఆర్.ఎమ్.వి.
రాఘవేంద్రరావు

"ఎంతో కష్టపడి వేసిన నా చిత్రాలు చిన్న చిన్న మొత్తాలకు అమ్ముడవగా వచ్చిన డబ్బు వాటికి సరిపోయేది ఇన్నాళ్ళూ. మీరు చెప్పినవన్నీ ఉన్నాయి .నా దగ్గర."

"మరింకేం కావాలి ?"

చక్రవర్తి ఒక్క క్షణం తటపటాయించి "నేను వేసే చిత్రాలకి కాన్వాసు, రంగులు, బ్రష్‌లు ఉంటే సరిపోతుందా వెన్నెల గారూ ?"

"అర్థమైంది. అయితే మీ ఫ్రెండ్స్ దగ్గరికి అందుకే వెళుతున్నారా ?"

"అవును. వాళ్ళ దగ్గర అలాంటి వాళ్ళు కొంత మంది ఉంటారట."

"అలాంటి వాళ్ళంటే ?"

"అదే, న్యూడ్ ఫిగర్స్ వెయ్యడానికి సహకరించే మోడల్ గర్ల్స్!"

"అంటే ఆడవాళ్ళేగా?"

ఆ మాటకు చక్రవర్తి వెన్నెల వైపు అదోలా చూశాడు.

"నేను కూడా ఆడదాన్నే అన్న విషయాన్ని మరచిపోతున్నారు."

ఆ మాటకు చక్రవర్తి తుళ్ళిపడ్డాడు.

"వెన్నెలా ! ఏమిటి మీరు మాట్లాడుతున్నారు ? మీరు నా అభిమానిగా వచ్చారు. మిమ్మల్ని ఆ దృష్టితోనే చూస్తున్నాను. కానీ మీరేమిటి ఇలా మాట్లాడుతున్నారు ?"

"నేను అందంగా లేనా? మీ చిత్రానికి నా కంటే అందమైన మోడల్ కావాలా ?"

"నో...నో మిస్ వెన్నెలా ! మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి. కానీ ఇలాంటి అభిమానం మంచిది కాదు. ఇది మీ జీవితానికి ఓ పెద్ద గొడ్డలి పెట్టు !" ఏదో ఉద్వేగంతో అన్నాడు చక్రవర్తి.

"శాంతంగా వినండి నేను చెప్పేది. అది నా జీవితానికి గొడ్డలి పెట్టు కాదు. నా జీవితానికి అది ఓ ఆధారం !"

చక్రవర్తి ఆశ్చర్యంగా చూశాడు వెన్నెలవైపు. వెన్నెల చెప్పడం మొదలు పెట్టింది.

"నా తండ్రి కళాకారుడు కాకపోయినా కళాభిమాని. ఆ అభిమానంతోనే కళాకారులకి, కళాసంస్థలకి తలకు మించిన సహాయం చేసేవారు. రంగస్థల నటుల్ని, రచయితల్ని ప్రోత్సహిస్తూ తనే అనేక కార్యక్రమాల్ని జరిపించే వారు. అవసాన దశలో చాలా అవస్థ పడి మమ్మల్ని అనాథలుగా చేసి వెళ్ళిపోయారు. నాకొక తల్లి, తమ్ముడు, చెల్లి ఉన్నారు. ముందు పుట్టిన నేనే వాళ్ళకు ఆధారం. ఏదో ఒకటి చేస్తూ వాళ్ళను ఇన్నాళ్ళూ పోషిస్తూ వచ్చాను. ఇప్పుడు చేయటానికి ఏమీ లేదు నాకు. ఓ కళాభిమాని కూతురుగా నాకు కళాభిమానం ఉంది. చిత్రకారులంటే, అందులోనూ మీరంటే నాకు విపరీతమైన అభిమానం. ఆ అభిమానంతో నా అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నే నీ నిర్ణయానికి వచ్చాను. మీకు వచ్చే దాంట్లో మీకు తోచినంత ఇవ్వండి చాలు. దయచేసి కాదనకండి—ప్లీజ్ !"

చక్రవర్తి గాఢంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

** ** **


ఆ గదిలో మూలనున్న టేబిల్ లైటు వెలగడంతో వెన్నెల ఆలోచనల్లోంచి తేరుకొని అటువైపు చూసింది. వెన్నెల తమ్ముడు చదువుకోడానికి ఉపక్రమిస్తున్నాడు. 'వీడు ఎదిగి అందొచ్చేవరకూ నే నీ కుటుంబాన్ని నడపగలిగితే నా కంతే చాలు' అనుకుంది. గోడవైపుకు తిరిగిపోయి మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది.

** ** **

క్రమక్రమంగా చక్రవర్తి నిలదొక్కుకొంటున్నాడు. అతని చిత్రాలకు విలువ పెరుగుతూంది.

అతను ఓ చిత్రకళా ప్రదర్శనలో 'శృంగార విషాదం' అనే చిత్రాన్ని ప్రదర్శించాడు. దానికి మొదటి బహుమతి వచ్చింది. మొదటి బహుమతి వచ్చినా చక్రవర్తి ముఖంలో ఎటువంటి ఆనందమూ కనిపించలేదు. అదే అడిగింది వెన్నెల.

"ఆనందించడం అనవసరం వెన్నెలా ! ఇంతకంటే ఎన్నో చక్కని చిత్రాలు వేశాను. కానీ



ఈ చిత్రానికి బహుమతి వచ్చింది ఎందుకో తెలుసా? చక్రవర్తి ఒక్కసారిగా పైకి వచ్చిన ఆర్టిస్టు. అలా పైకి రావడానికి కారణం ఎంతమందికి తెలుసు?"

"కారణం తెలియకపోయినా ఆ చిత్రంలోని అర్థం అందరినీ ఆలోచింపజేసింది."

"ఆలోచించి, ఆలోచించి వేసిన చిత్రం కాదది. అనాలోచితంగా వేసింది."

"కాదండీ, మీలో పాతుకుపోయిన ఆలోచనల్లోని ఒక ఆలోచన మారిపోయి, ఎదిగిపోయిన చిత్రకారుణ్ణి తట్టింది."

"కావచ్చు. కానీ ఆ చిత్రంలో సెక్స్ ఉంది. దాన్ని చూసేవాళ్ళ సంఖ్యే ఎక్కువ ఉంది."

"ఎలా అనుకున్నా అది మంచి చిత్రం. అందుకే బహుమతి వచ్చింది. ఎవరైనా అలాగే అంటారు."

"అవును. నా మిత్రులు సుందరం, గోపాల్ కూడా నీలాగే అన్నారు."

"ఏమన్నారు?"

"మామూలే! నా ఈ స్థితికి కారకులు వాళ్ళే. అది తెలిసి కూడా నేనేదో గొప్పవాడినైనట్టు నన్ను పొగిడారు."

"కారకులు వాళ్ళేనా?"

"అవును. నీ తరువాత వాళ్ళే!"



"అదేమిటి, ప్లేటు ఫిరాయించారు? మీరు కోరుకుంటే డబ్బు కోసం నాలాంటి వాళ్ళు చాలా మంది దొరుకుతారు మీకు."

"కావచ్చు. నువ్వు నన్ను నీ మనసుతో, మాటలతో ప్రతీసారీ ప్రోత్సహించావు. వాళ్ళు ఎప్పటినుంచో చెబుతున్నా, నేను కూడా ఎప్పటినుంచో ఆలోచిస్తున్నా నేను మారిందీ, ఎదిగిందీ నీతో పరిచయం ఏర్పడినప్పుడే! నీ జీవితాన్ని కూడా లెక్క చేయకుండా నాకు ఎంతగానో సహకరించి ప్రోత్సహించిన వ్యక్తివి నీవే!"

అవే మాటలు ఇప్పటికీ వెన్నెల చెవుల్లో గింగురుమంటున్నాయి. ఇంత వరకూ జరిగింది గుర్తొచ్చాక ఆమె హృదయం ఎందుకో తల్లడిల్లిపోయింది. ఆ తరువాత తనలో తనే అదోలా పిచ్చిదానిలా మాట్లాడేసుకోవడం మొదలు పెట్టింది.

ఆ రోజు...

"నీకో గుడ్ న్యూస్ వెన్నెలా!" అన్నాడు చక్రవర్తి.

"ఏమిటి?" అని అడిగాను మామూలుగా.

"నీ స్నేహం నా జీవితాన్ని ఓ మలుపు తిప్పింది. చిత్రకారుడుగా గుర్తింపు పొందాను. పత్రికల్లో కూడా నంబర్ వన్ ఆర్టిస్టునయ్యాను. ఇప్పుడు ముందు నోరు తెరు చెబుతాను."

చక్రవర్తి నా నోట్లో మిఠాయి కుక్కాడు. ఉక్కిరిబిక్కిరి అయ్యాను నేను.

"చెప్పండి..."

"సాగరతీరం ఫిలింస్ అధినేత నన్ను వాళ్ళు తీసే భారీ చిత్రంలో వర్క్ చేయమని కోరుతూ ఉత్తరం రాశారు. రేపే ప్రయాణం."

విషయం విన్న నా మనసు ఆనందంతో పరవశించిపోయింది. ఏదో అనబోయాను. అంతలో "మరో విషయం—నేను పెళ్ళి చేసుకుంటున్నాను" అని అన్నారాయన. అంతే! నేనదోలా అయిపోయాను. ఎందుకో ఏమో, ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నా ముఖకవళికలు నా అదుపు తప్పిపోయాయి. కారణం—అతని చక్కని మాటలు, మెత్తని ప్రవర్తన నన్నాకర్షించేయి. చాలా రోజులుగా నేనెవరినో ఏమిటో అన్న విషయాన్ని కూడా మరచిపోయి అతనంటే అదో రకమైన భావాన్ని నాలో నేనే పెంచుకున్నాను కొన్నాళ్ళుగా. అది అతనంటే ఇష్టమో లేక ప్రేమోగానీ!

అంతలోనే ఆయన "ఏం వెన్నెలా! ఏమీ మాట్లాడవేం!" అన్నారు.

ఉలిక్కిపడి "అబ్బే, ఏం లేదు. పెళ్ళికూతురు ఎవరు?" అని అడిగాను. నాకెందుకో నా స్వరం నాకే కొత్తగా—వింతగా అనిపించింది. ఆయన పెదవులు కదిలాయి.

"వెన్నెల..."

లయ తప్పిన గుండె చప్పుడు మరలా మామూలు స్థితికి వచ్చింది. నా శరీరంలో అణువణువూ ఏదో అనుభూతికి లోనయింది.

"అంగీకారమేనా?"

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, ఇంటికి ఎలా వచ్చానో—ఒకటే ఆనందం! అంతులేని సంతోషం!!

ఏమిటా ఆనందం? ఎందుకంత సంతోషం? నీకేమైనా పిచ్చి పట్టిందా? నువ్వేమిటి, చక్రవర్తిని పెళ్ళి చేసుకోవడమేమిటి? అసలు నీవు ఆ

విషయాన్ని అతనికి చెప్పావా ? అతని కసలు అది తెలుసా ? అని నన్నెవరో లోపల్నుంచి ప్రశ్నించి పిచ్చిగా నవ్వేవరకూ ఆ సంతోష సాగరంలోంచి బయటకు రాలేదు నేను.

అప్పటినుంచే ఆలోచనల్లో పడ్డాను. రెండు వైపులా ఆలోచిస్తున్నాను. ఒక ఆలోచనకు ధైర్యంగా ఉంటుంది. మరో ఆలోచనకు గుండె బరువెక్కిపోతుంది. ఇప్పుడు నేనేం చేయాలి ? ఎంత ఆలోచించినా, ఎలా ఆలోచించినా అతనికి అసలు విషయం చెప్పడమే మంచిది అనిపిస్తుంది. చెప్పేస్తాను. ఆ తర్వాత అతని నిర్ణయం ఎలా ఉంటుందో ? ఎలా ఉన్నా నేను చేయగలిగేది ఏముంది ?

తొలి కోడి కూసింది.

జరిగిన దాన్ని గుర్తుకు తెచ్చుకొని ఆలోచించి, ఆలోచించి, గజిబిజిగా ఉన్న ఆ ఆలోచనల్లోంచి ఇప్పుడేం చేయాలి ? అన్న ప్రశ్నకు సమాధానాన్ని వెతుక్కొనేసరికి బాగా అలసిపోయింది వెన్నెల. అందుకే మగతగా నిద్రలోకి జారిపోయింది.

** ** **

మర్నాడు వెన్నెల చక్రవర్తి ఉంటున్న ఇంటికి వెళ్ళేసరికి చక్రవర్తి ఇంట్లోనే ఉన్నాడు.

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను వెన్నెలా !"

"ఏదైనా చిత్రం గీయాలా ?"

"కాదు—నిన్నటి నీ చిత్రమైన ప్రవర్తన గురించి ముచ్చటించుకోవాలి" అని వెన్నెల కళ్ళల్లోకి అదోలా చూసి నవ్వాడు చక్రవర్తి.

వెన్నెల నవ్వలేదు.

"నిన్నేమిటి ఏమీ మాట్లాడకుండా పారిపోయావ్? సిగ్గా? లేక కోపమా?"

"రెండూ కాదు—భయం !"

"ఎందుకో ?"

"మీ కో విషయం చెప్పాలి."

"ఏమిటది? చెప్పు !"

"మీరు నన్ను పెళ్ళి చేసుకుంటే నేను నా వాళ్ళకు దూరం అవ్వడం తప్పదు కదా ?"

"తప్పదు. వాళ్ళు పడుకునే గదిలోనే నువ్వూ పడుకుంటే ఇంక పెళ్ళి చేసుకోవడం ఎందుకు ? అందుకే వాళ్ళకు దూరంగా నా దగ్గర, వేరే గదిలో ఉండాలి. నన్ను పెళ్ళి చేసుకుంటే అది తప్పదు మరి !" కొంటెగా నవ్వుతూ అన్నాడు చక్రవర్తి.

"నేను హాస్యానికి అడగడం లేదు. సీరియస్‌గా తీసుకుని చెప్పండి. నా వాళ్ళకు నేనే ఆధారం ! ఆ ఆధారం మరో ఆలంబనను చూసుకొని దూరమైతే మరి వాళ్ళ గతి ఏమిటి ?"

"దూరం కావటం ఎందుకు వెన్నెలా ! ఈ విషయాన్ని నీతో నా అభిప్రాయాన్ని చెప్పకముందే ఆలోచించాను. వాళ్ళు మనతోనే ఉంటారు. నీతో ఆనందాన్ని మాత్రమే కాదు, నీ బాధ్యతల్ని కూడా నేను పంచుకుంటాను. ఇంక నీ అనుమానం తీరిందా ?"

వెన్నెల ఆలోచనలో పడింది. ఆ విషయం చెప్పకుండా ముందు ఈ విషయం చెబితే అక్కడే ఎటువంటి రాజీ కుదరకపోతే చక్రవర్తికి ఆ కారణంగా దూరం కావచ్చుననుకుంది. కానీ చక్రవర్తి ఆ విషయాన్ని పెద్ద సమస్యగా తీసుకోలేదు.

"ఏమిటి వెన్నెలా, ఇంకా అదోలా ఉన్నావ్ ? చెప్తానన్న విషయం చెప్పేశావ్ కదా ?"

వెన్నెల ఆలోచనలోంచి బయట పడి చక్రవర్తి వైపు చూసింది.

"నే నింతవరకూ మీకు ఏ విషయమూ చెప్పలేదు. ఒక విషయాన్ని—అడిగాను అంతే !"

"అయితే చెప్పే విషయం ఏదో చెప్పే సేయి వెన్నెలా !"

"చెప్తాను—జాగ్రత్తగా వినండి. నా పేరు వెన్నెల కాదు."

" ఈ జోకు బాగుంది."

"జోకైతే బాగానే ఉండేది. కానీ ఇది నిజం !"

"అంటే !"

"నా పేరు లక్ష్మి !"

"ఇదేనా నువ్వు చెప్పేది? ఏ పేరైతేనేం ? నేను వెన్నెల అనే పిలుస్తాను."

"నేను చెప్పేది ఇంకా పూర్తి కాలేదు. పూర్తిగా చెప్పేవరకూ ఆగండి."

"ఏమిటి వెన్నెలా ? చెప్పు."

"నేను మీ దగ్గరకు మొదటిసారి వచ్చినప్పుడు నేను మీ అభిమానినని చెప్పాను. గుర్తుందా ?"

"ఊఁ."

"కానీ, నేను మీ అభిమానిని కాదు. అలా అని అబద్ధం చెప్పాను."

"అబద్ధమా? అంటే నీ తండ్రి, నీ పరిస్థితులు, నీ అవసరం—ఇవన్నీ కూడా అబద్ధాలేనా ?"

"నా తండ్రి గురించి చెప్పినవి అబద్ధాలు కావు. నా పరిస్థితికి కావలసిన అవసరాన్ని మీరు తీర్చక పోయినా నాకేం పరవాలేదు."

"అయితే నిజం ఏమిటో చెప్పు వెన్నెలా!"

"అది చెప్పడానికే ప్రయత్నిస్తున్నాను. కానీ చెప్పలేకపోతున్నాను."

"ఎందుకు ?"


"నిజం కనుక—ఘోరమైన నిజం కనుక—నేను మిమ్మల్ని మనసారా కోరుకుంటున్నాను కనుక..."

"ఇదైనా నిజమేనా ?"

"ఏది ?"

"నీ ప్రేమ!"

ఆమె దెబ్బ తిన్నట్లుగా చూసింది చక్రవర్తి వైపు...




"నిజం కాబట్టే ఎలా చెప్పాలో తెలియక తికమకపడుతున్నాను... అబద్ధమైతే ఇంత ఆలోచించ నవసరం లేదు. అసలు ఆ విషయం చెప్పనవసరమే లేదు."

"వెన్నెలా! నిన్ను నేను మనఃస్ఫూర్తిగా ప్రేమించాను—అందుకే ఆ ప్రేమైనా నిజమౌనో కాదోనని భయపడి అలా అడిగాను—చెప్పు వెన్నెలా, ఏమి టా విషయం?"

"నేను మోడల్‌గా మారింది ముందు మీ దగ్గర కాదు."

"అంటే?" భ్రుకుటి ముడిచి అడిగాడు చక్రవర్తి...

"నేను నగ్న చిత్రాలు వే సే చాలామంది దగ్గర మోడల్‌గా ఉండేదాన్ని."

"అలాగా! అయితే అబద్ధం చెప్పి నాతో స్నేహం చేయడానికి కారణం?"

"వాళ్ళు అలా చేయమన్నారు. అందుకే చేశాను. కానీ ప్రేమించాను, ప్రేమించబడ్డాను. ఒకటయ్యే ముందు మోసం చేయకూడదనిపించింది. అందుకే ఈ విషయాన్ని ఇప్పుడు చెపుతున్నాను."

"ఎవరు వాళ్ళు?"

"ఎవరో కాదు—మీ మిత్రులే...సుందరం, గోపాల్—వీళ్ళిద్దరూ!"

"ఎందుకలా చేయమన్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు చక్రవర్తి...

"వాళ్ళెంత ప్రయత్నించినా మీరు మారలేదట. మీ మీద అభిమానంతోనే వాళ్ళిలా చేశారు. ఏదో చెప్పి, ఎలాగోలా మిమ్మల్ని మార్చి, ఈ ప్రపంచం మిమ్మల్ని గుర్తించేలా చేయమన్నారు. అందుకే మీ జీవితంలోకి ప్రవేశించాను. అందుకోసం ఈ అబద్ధాలు చెప్పవలసివచ్చింది. ఇవన్నీ అబద్ధాలు అని మీతో చెప్పేవరకూ నా మనసు మనసులో లేదు. చెప్పేశాక నా కెంతో తేలిగ్గా ఉంది."

"... ..."

"నాకు తేలిగ్గా ఉంది. కానీ, మీకు చాలా కోపంగా ఉంది కదూ నామీద?"

"వెన్నెలా..." చక్రవర్తి ఏదో చెప్పబోయాడు.

"వెంటనే ఏ ఒక్క నిర్ణయానికీ రాకండి. మీరు వెళ్ళేది రేపే కదా, వెళ్ళేముందు చెప్పండి. బాగా ఆలోచించి మరీ చెప్పండి."

"... ..."

** ** **

సమయం ఏడున్నర అయింది. రైలు కదలడానికి ఇంకా అయిదు నిముషాలుంది.

"మే మిద్దరం అనేవాళ్ళం కదరా—నీ వెప్పటికైనా గొప్పవాడివవుతా"వని అన్నాడు సుందరం...

"నువ్వు సినీఫీల్డ్‌లో కూడా డామినేట్ చేస్తావురా తప్పకుండా. అందుకే అంటారు—ప్రతి గొప్పవాడి వెనుకా ఓ స్త్రీ ఉంటుందని. ఈ క్రెడిట్ అంతా వెన్నెలగారిదే!" అన్నాడు గోపాల్...

చక్రవర్తి ఏదో అనబోయాడు కానీ, ఎందుకో ఆగిపోయి సుందరం, గోపాల్ ఇద్దరివైపూ ఒక్కసారి చూసి, ఆ తరువాత వెన్నెలవైపు చూశాడు అదోలా. కిటికీ ఊచ పట్టుకొని చక్రవర్తివైపే చూస్తూ నిల్చున్న వెన్నెల చక్రవర్తి తనవైపు అదోలా చూసేసరికి తల కొద్దిగా వంచి దృష్టిని నేలమీదకు మరల్చింది.

అంతలో సిగ్నల్ ఇచ్చేశారు...
"విష్ యూ గుడ్‌లక్!" అన్నారు గోపాల్, నుందరం...
రైలు కదిలే సమయంలో "వెన్నెలా, మరి నే వెళ్ళొస్తానూ" అని చెప్పి నుందరం, గోపాల్ ఇద్దరూ చూడకుండా ఒక కవరు ఇచ్చాడు వెన్నెలకు చక్రవర్తి. వెన్నెల దాన్నందుకొని కొంగుచాటున దాచేసింది. రైలు కదిలిపోయింది. నుందరం, గోపాల్‌లు చేతులూపారు. వెన్నెల కూడా చిన్నగా చేయి ఊపింది. రైలు స్పీడందుకుంది.
స్టేషన్ బయటికి వచ్చేశాక నుందరం అన్నాడు—"వెన్నెలా! అబ్బ, బలే అలవాటైపోయింది లక్ష్మీ! ఎలాగైతేనేం మేం చెప్పినట్టు చేసి వాణ్ణి పైకి తీసుకొచ్చావ్. రియల్లీ యూ ఆర్ గ్రేట్! చక్రవర్తి కూడా మాతో నీ గురించి చెప్పేవాడు చాలాసార్లు. నా జీవితంలో ఓ చక్కని మలుపు వెన్నెల అనేవాడు. ఆ మధ్య ఓసారి మాతో ఏమన్నాడో తెలుసా?"
"ఏమన్నారు?"
"నిన్ను పెళ్ళి చేసుకుంటానని అన్నాడు."
"... ..."
"ఏమిటి, అసలేమీ ఆశ్చర్యపోవడం లేదు? వాడీ విషయం నీతో చెప్పేశాడా?"
"ఇంకా ఏ విషయం చెప్పలేదు."
"చెప్పాలని చాలాసార్లు ప్రయత్నించాడు. నిన్న నేను అడిగాను వాణ్ణి. మద్రాను వెళ్ళొచ్చాక నీతో చెప్తానన్నాడు. వాడు చెప్పాక నీవేం చేస్తావ్ లక్ష్మీ?"
"ఏం చేయమంటారో మీరే చెప్పండి."
"ఏం చేయమంటాం? వాడికోసం అబద్ధం చెప్పావ్. నీ కోసం ఆ అబద్ధాన్ని నిజం చేయమంటాం. వంద అబద్ధాలు ఆడి ఒక పెళ్ళి చేయమన్నారు. ఒక నిజం చెప్పకుండా మీ పెళ్ళి మేం చేస్తాం!" అన్నాడు గోపాల్...
"అవును లక్ష్మీ! వాడి అదృష్టానికి నీవు నాందివయ్యావు. నీ జీవితానికి వాడు పునాది కావాలి. ఈ నాటకం నీ జీవితంతో కలిసిపోవడం ఒక విధంగా నీ అదృష్టం! నీమీద గానీ, మామీద గానీ వాడికి ఇంతవరకూ ఎటువంటి అనుమానం రాకపోవడం—అది నీ వరం!" అన్నాడు నుందరం...
"అంటే ఇది అతన్ని మనమంతా కలసి మోనం చేయడం కాదా? ఒకవేళ మిగిలిన ఆర్టిస్టులు ఈ విషయాన్ని ఆయనకు చెప్పేస్తే?"
"మా ఉద్దేశం జీవితాలను బాగు చేయడమే గానీ, మోసం చెయ్యడం ఎంతమాత్రం కాదు. ఎవరైనా చెప్తారేమో అన్న అనుమానం నువ్వేమాత్రం పెట్టుకోవద్దు. ఎందుకంటే అలా ఎవ్వరూ చెప్పరు. గొప్ప పేరు ప్రఖ్యాతులున్న వాడికి ఎవరూ ఆ విషయం చెప్పలేరు. ఆ విషయం తెలిసే నిన్ను వాడు పెళ్ళి చేసుకున్నాడని చెబుతాం అడిగినవాళ్ళకు. అవన్నీ మేం మానేజ్ చేస్తాం కదా?" అన్నాడు గోపాల్...
వెన్నెల చిన్నగా, అదోలా నవ్వింది...
"ఏది జరగాలో, ఎలా జరగాలో కాలమే చెపుతుంది గానీ, మళ్ళీ నన్నెపుడు రమ్మంటారు మీ ఇద్దరి రూములకీ?" అని అడిగింది వెన్నెల...
"లక్ష్మీ! నీకు అవసరమైనవి మేం నమకూరుస్తాం గానీ ఇక నువ్వు మా రూమ్‌కి రావద్దు. ఇప్పుడు నువ్వు మా మిత్రుడి భార్యవి" అన్నాడు నుందరం...
"అవును లక్ష్మీ! కాదు, ఈ రోజు నుంచీ నీ పేరు నిజంగా వెన్నెలే! నువ్వు ఇంకెప్పుడూ మా రూమ్‌కి రావద్దు. వాడొచ్చేవరకూ అన్నీ మేం చూసుకుంటాం—నువ్వెళ్ళు" అని ఆటోని పిలిచాడు గోపాల్...
వెన్నెల మౌనంగా ఆటో ఎక్కింది. ఇంటికి వెళ్ళిన వెంటనే వెన్నెల చక్రవర్తి ఇచ్చిన కవరు విప్పి చూసింది. ముత్యాల్లాంటి అక్షరాలు...ఆత్రతగా చదవడం మొదలు పెట్టింది.
"డియర్ వెన్నెలా!
నీ అసలు పేరు లక్ష్మి అని తెలిసినా నిన్ను వెన్నెలా అనే పిలుస్తున్నాను. కారణం—అలా పిలవడం అలవాటైపోయింది. నేను నిన్ను ప్రేమించానన్న విషయం నిజం. నువ్వు 'ఆ' విషయాన్ని చెప్పిన వెంటనే నేను అదే చెబుదామనుకున్నాను. 'నిన్ను తప్ప వేరేవాళ్ళను పెళ్ళి చేసుకోలేను' అనే అందామనుకున్నాను. కానీ, నువ్వు ఆ విషయాన్ని చెప్పనివ్వలేదు. బాగా ఆలోచించాకనే ఏ విషయమైనా చెప్పమన్నావు.
అందుకే నువ్వు వెళ్ళిపోయాక బాగా ఆలోచించాను. ఆ ఆలోచనల్లో నా భవిష్యత్తు, అందులో నా అభివృద్ధి, ఉన్న పేరు, రాబోయే పేరు అన్నీ చోటు చేసుకున్నాయి. అంతేకాదు, నీ పరిస్థితి, నీ ప్రేమ, నీ భవిష్యత్తు, నీ మంచితనం—ఇవి కూడా ఆ ఆలోచనల్లో భాగమయ్యాయి. అందుకే నే నో నిర్ణయానికి వచ్చాను.
వెన్నెలా! మళ్ళీ చెబుతున్నాను. నేను నిన్ను నిజంగా ప్రేమించాను. నువ్వు మంచిదానివని అనుకునే ప్రేమించాను. నిజంగా నువ్వు చాలా మంచిదానివి. కాకపోతే ఆ నిజాన్ని దాచేయడానికి నీ కెంతో అవకాశం ఉంది. నా మిత్రులు నా కోసం నిన్ను పంపారు. నిన్ను ప్రేమించానని, ఆ విషయం నీతో చెబుతానని వాళ్ళకు చెప్పినప్పుడు కూడా వాళ్ళు నీవు చెప్పిన నిజాన్ని నాకు చెప్పలేదు. అంటే మనం పెళ్ళి చేసుకుంటే వాళ్ళు ఆ నిజాన్ని దాచేసి ఉండేవారు. మరెవ్వరూ నాకు ఆ విషయం చెప్పకుండా చేసేవారు. నేను కూడా ఎప్పుడూ నిన్ను అలా అనుకోలేదు. కారణం—నాకు ఏ ఇతర మోడల్స్‌తోనూ పరిచయం లేదు. నిన్నెప్పుడూ ఎక్కడా మోడల్‌గా చూడలేదు. ఇంతటి అవకాశం ఉండి కూడా నువ్వు నిజాన్ని నాకు చెప్పేశావు. అందుకే అన్నాను నువ్వు చాలా మంచిదానివని!
కానీ, వెన్నెలా! నేను నిన్ను పెళ్ళి చేసుకోను. ఇంత సూటిగా—నిష్కర్షగా రాశానని ఏమీ అనుకోవద్దు. నామీద కోపం పెంచుకోకు. అందుకు కారణం బాగా ఆలోచిస్తే నీకే అర్థం అవుతుంది. అయినా చెబుతాను. కాబోయే భార్య అంగాంగాన్నీ మరొకరు, అందులోనూ తనతో కలిసి మెలిసి తిరిగిన స్నేహితులు చూడటాన్ని—అఫ్‌కోర్స్, కళాత్మక దృష్టితోనే అనుకో—భరించలేని, ఆ విషయం తెలిసి తట్టుకోలేని చాలామంది మామూలు మగవాళ్ళలాంటి వాడినే నేనూ అని ఒప్పుకోవడానికి నే నేమాత్రం సంకోచించలేకపోతున్నాను.
ఎందుకో ఏమో నా ప్రేమను, కృతజ్ఞతను, నీ భవిష్యత్తు గురించిన ఆలోచనలను, నా భవిష్యత్తుమీది ఆశ, నా పేరుకు ఎటువంటి మచ్చ వస్తుందోనన్న భయం నువ్వు బ్రతకగలవన్న ధైర్యం డామినేట్ చేస్తున్నాయి. అంతేకాదు, మెత్తని నా మనసు ఒకసారి మారిపోవడానికి చాలా కష్టపడింది గానీ, అదేమిటో ఇప్పుడు మారిపోవడానికి ఏమాత్రం కష్టపడడం లేదు. అందుకే ఈ నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది.
వెన్నెలా, నా విషయంలో నీవు నా కెంతో హెల్ప్ చేశావు. కాదనను. నీ శ్రమకు తోచినంత ఫలితాన్నిచ్చినా నా అభివృద్ధికి పునాది రాయివి నీవే అని నేనెప్పుడూ మరచిపోను. కానీ, ఈ విషయంలో మిస్ వెన్నెలా, అయాం ఎక్స్‌ట్రీమ్లీ సారీ!

ఉంటాను...
—చక్రవర్తి."

ఉత్తరం చదవడం పూర్తి చేసిన వెన్నెల ఏడవలేదు. నవ్వలేదు. కిటికీలోంచి కనిపిస్తున్న చంద్రుణ్ణి పిచ్చిగా చూస్తూ అలాగే ఉండిపోయింది.

★

